# చరిత్రహీనులు

* "మరామ" *

★

ఇది జీవితంలో మఱపురాని సంఘటన. దాన్ని తలచుకుంటుంటే నా హృదయం జరిగిన అవమానానికి క్రుంగిపోతోంది. అయినా రామూ నా భగ్నజీవితగాథను ఒకరితో చెప్పుకుంటుంటే కొంచమయినా నా హృదయానికి శాంతి కూరేటట్లు కన్పడుతున్నది. జరిగిన అవమానాన్ని నా హృదయం దాచుకోలేక పోతున్నది. "ఒకరితో నీ బాధ తీర్చుకో" అంటున్నది, నిజమే నాకూ అలాగునే కన్పించింది,

సంఘంలో సగానికి సగంపైన దుష్టులు అసూయపరులున్నారు. వాళ్లున్నట్టు వుండక వున్నవారిని కూడా నాశనం చెయ్యటానికి చూస్తారు. సంఘంలో వ్యక్తిత్వంకూడా లేదని తోస్తోంది. వాడేదన్నా స్వయంగా చేసుకుంటుంటే అందరూ ఏడ్చేవాళ్లే...సంఘంలో కాస్త మంచిబట్టలు వేసుకుంటే రౌడీ అంటారు. Social గా Free గా మాట్లాడితే పిచ్చోడంటారు. Serious గా మాట్లాడుతే వీడికి 'టెక్కు' అంటారు. ఇంకా సంఘంలో నడిచే దెలా?

నాకే అర్థం కాలేదు. సంఘం నన్ను అర్థంచేసుకోలేక పోతున్నదా? నేనే సంఘాన్ని అర్థంచేసుకోలేక పోతున్నానా?

ఆలోచనలు రాత్రింబవళ్లు ప్రతిరోజూ నా మెదడును చెడగొట్టున్నాయి. సంఘంలో అజ్ఞానం, అనాగరికత నిబిడీకృతమయ్యాయి. నాగరికితఅంటే ఏమిటో తెలియదు. ప్రేమంటే ఏమిటో తెలియదు... ఈ సంఘం నన్నిలా బాధపరుస్తున్నదంటే నువ్వు నమ్ముతావో నమ్మవో రామూ! అని నాతో చెప్తూ సత్యం కన్నీళ్లు కార్చుతూ, రామూ ఆ నాడు ఆమెను ప్రేమించానంటే సంఘం నన్ను దూషించింది... చెడ్డవాడన్నది. కుల, మత భేధంచూచి నన్ను హేళనచేసింది. చివఱకు పగసాధించుకోవటానికి కూడా ప్రయత్నించింది. ఎందుకంటావేమో పర మత స్త్రీని ప్రేమించానని...

పర మత స్త్రీని ప్రేమిస్తే తప్పా!... నాక్కావల్సింది పవిత్ర ప్రేమ. నిష్కళంకమైనది నిర్మలమైన ప్రేమ. అంతేకాని నాకేమాత్రం మతంతో సంబంధం లేదు. కులంతో సంబంధం లేదు...

అలా అంటుంటే నన్ను వెధవక్రింద కట్టి తన్నటానికి చూచారు. వెలివెయ్యటానికికూడా ప్రయత్నించారు. ఇవన్నీ నాకు లెక్కా రామూ?...మొండికేశాను...సంఘాన్నేమాత్రం లెక్కచెయ్యలేదు...

అదివఱకుదాక సంఘం పవిత్రమైనదని నాగరికత కలదని జ్ఞానంకలదని అనుకున్నా ...కాని నాకలలు చెదిరాయి...నాఅత్యంత భావాలు అణిగిపోయాయి. సంఘమంటే ఏలాటిదో ఈనాడు తెలిసికోగల్గాను.

పెద్దవాళ్లు ఎంత చెడ్డపనైనా చేయవచ్చు...నేను పరమతస్త్రీని ప్రేమించానని నిందించారు. వారు మాత్రం ... చేసేది మంచిదంటావా? ... ఒక పెద్దమనిషి తన కామాన్ని ఆపుకోలేక అమాయకురాలైన పరాయిస్త్రీని చెడిచాడు. మరింకొకడు ఇంకోదాన్ని...ఏమన్నాఅంటే దాన్ని ప్రేమించానంటం. ప్రేమంటే అలాగే వుంటుందా? వాళ్ళదృష్టిలో వారిభావాల్లో ప్రేమ కేవలం కామాన్నితీర్చుకోవడంకోసమే. అంతే... అంతేకాని సరియైన అర్థం భావం తెలియక ప్రేమ అనే ఆ పదానికి పేరుకూడా పోగొట్టున్నారు అనాగరికులు....

ఇంకా అటువంటివాళ్ళను గురించి నేనేం చెప్పేది ... రామూ నా హృదయ బాధను తీర్చుకోలేకపోతున్నా...

పాపం! ఆమె అమాయిక...మిసిమిసిలాడే ఆమె నవయావన సౌందర్య ముగ్ధత్వాన్ని ఆస్వాదించాను ... ఆమె నున్నిత మధురభావాలు నన్నాకర్షించాయి. ఆనాడు ఆమెతో మాట్లాడుతుంటే...

ఆరోజుల్లో నాకోసం గుమ్మంలో కూర్చొని కళ్లు వాచిపోయేటట్టు చూస్తోండేది. కొంచం ఆలస్యమయితే చాలు ఆమె హృదయ భాగంలో వెయ్యి మణుగుల బరువు దింపినట్టుండేది. నా రూపం ఆమె కళ్ళకు కనపడగానే బరువంతా మాయమయ్యేది. ఆపుకోలేని ఆవేదన ఆగిపోయేది... కళ్ళల్లో నూతనోత్తేజం కన్పడేది...ఎఱ్ఱని చిన్ని పెదిమలమీద చిఱునవ్వు నాట్యం చేస్తుండేది...

కులాసాగా మాట్లాడుకునే వాళ్ళం. నవ్వుకునేవాళ్ళం. అలా ఆనందంతో వుంటుండేవాళ్ళం...

నేను వాళ్ళింటికి ప్రతిరోజూ వెళ్లుతుంటే అంతా తిట్టిపోశారు వాళ్ళను నిందించారు...ఇంకా ఎన్నో ఎన్నో మాటలన్నారు. కాని నేనేం లెక్కచేయలేదు. లోకులేమనుకున్నా కాని హాయిగా చక్కగా, మాట్లాడుకొంటూ కాలం గడుపుతున్నా.

అలా చాలారోజులు గడిచాయి. లాభమేమిటి? బీజంనాటి మొలకలెత్తించిన ఈ ప్రేమ వృక్షం పూవులుపూచి మా జీవితాలకు మెఱుగునిచ్చి మాహృదయాలకు ఆనందం చేకూర్చుతుందనుకున్నాం ...... కాని వున్నాయిగా చీడపురుగులు. ఉన్నవి వుండక మాజీవితాల్ని, పవిత్రప్రేమను నాశనం చెయ్యటానికి ప్రయత్నించాయి.

నన్నింట్లో వాళ్ళంతా తిట్టిపోశారు. ఒకనాడు నన్ను గురించి మా మామయ్య గూడా ఏడ్చాడు. నేనేదో చెడిపోతున్నానని, నా జీవితం నాశనమవుతున్నదని ... ఇంకా ఎన్నో ఎన్నో అనుకొంటూ తన వంశ మర్యాదలు పోగొట్టుతున్నానని నన్ను తిట్టూ ఏడ్చాడు, కాని నేనేం మాట్లాడలేదు.

లోకుల మాటలకు, నిందలకు గురైనా —పవిత్రప్రేమను వదలుకుంటానా? ఎంత నిర్మల హృదయంతో ఆమెను ప్రేమిస్తున్నానో! ఎన్ని మధుర భావాలు నా హృదయంలో దొర్లిపోతున్నాయో? ఎవరికేం తెలుసు? ...

వారే గనుక నా స్థితిలో వుంటే నా బాధా హృదయాన్ని గుర్తించగలిగేవారు.

నన్ను నా ప్రేయసినుండి విడదీయటానికి ప్రయత్నించారు. అనేక రోజులు ఆలోచనలు జరిపారు. ఆమె తల్లిదండ్రుల్ని రహస్యంగా పిలిచి వాళ్ళను నిందలకు గురిచేసి వాళ్లు జాగ్రత్త తీసుకోపోయిన తగిన చర్య తీసుకుంటామని భయపెట్టారు. అంతే ...

ఆ మాటలకే వాళ్లు భయపడ్డారు. వాళ్ళమ్మాయిని దాచేసుకున్నారు. సంఘానికి భయపడ్డారు. నీచులు మా నిర్మల ప్రేమను విచ్ఛిన్నం చేయసాగారు. అనేకసార్లు ఆమె నాకు వుత్తరాలు వ్రాశింది తనను కలుసుకోమని ఆ మధురక్షణంకోసం ఆరాటపడుతున్నదని. కాని ఆ మధురక్షణం ఆమెకు ప్రాప్తిలేకుండా పోయింది. తిరిగి ఆమెను మళ్ళీ కలుసుకునే అవకాశం నాకు చిక్కలేదు. ఎన్నిసార్లు వాళ్లింటికి వెళ్లినా ఆమెను దాచేసేవారు. అది చూస్తుంటే నా హృదయం తరుక్కుపోతుండేది. ఇంతకన్నా అవమానముందా? అని పదే పదే సార్లు అనుకొని విచారపడుతుండేవాణ్ని. నా చివరి మాటల్ని ఆమె కందజేయాలని ఎన్నో సార్లు ప్రయత్నించాను. కాని ఏం లాభంలేకపోయింది. శుష్కహృదయంతో తేలిపోయే కాళ్లతో నెమ్మదిగా నడుచుకొంటూ విచారంతో ఇంటికి చేరుకుంటుండేవాణ్ని ...

పదేపదేసార్లు వాళ్లింటికి వెళ్ళడంవల్ల వాళ్ళకూ విసిగెత్తింది. ఆమెకు పెళ్ళిచేస్తే రానేమో యని వుద్దేశంచేత పెండ్లి మాట తలపెట్టారు. వరుణ్ణి వెదికారు తీసుకొచ్చారు —ఈనాడే పెళ్ళి... ఆమె సున్నిత హృదయాని కెంత బాధ కలిగిస్తున్నదో ఈపెళ్ళి. రామూ ఆ పెళ్ళికి నన్ను కూడా ఆహ్వానించారు. నన్నే కాదు అందర్నీ. కాని నా మనస్సంగీకరించలేదు. ఇక మళ్ళీ ఈ జీవితంలో నాముఖం ఆమెకు కన్పించకూడదు. పాపపంకిలమయిన ఈ రూపాన్ని ఆమెకు కనపరిస్తే ఆమె మధురజీవితం కళంకానికి గురిఅవుతుంది ...

రామూ లోకులంతా కలిసి నన్నీస్థితికి తెచ్చారు. అజ్ఞానులు, అనాగరికులతో నిండివుందీ సంఘం. ఇంకా సంఘం బాగుపడాలంటే ఎలా చెప్పు.

నా హృదయానికి బాధ, నా జీవితానికి అశాంతి కల్పించిన ఈ చరిత్రహీనుల్ని నువ్వు నమ్ముతావా? నమ్మవో! మరి....